క్లుప్తంగా

## టీ కొట్టుకు నిప్పు



కాలిపోయిన టీ దుకాణం

బల్లికురవ: టీ దుకాణం ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తుండగా దుండగులు రాత్రికి రాత్రే తన టీ దుకాణానికి నిప్పు పెట్టారని బాధితుడు కోడెల సతీష్ శనివారం వాపోయారు. మండలంలోని ఉప్పుమాగులూరు గ్రామానికి చెందిన సతీష్ వేమవరం జంక్షన్‌లో టీదుకాణం ఏర్పాటు చేసుకున్నాడు. శనివారం ఉదయం దుకాణానికి వేసిన పాక, దుకాణంలోని కొంత సామగ్రి కాలి బూడిదై ఉన్నాయని, పథకం ప్రకారంమే తన దుకాణానికి నిప్పంటించారని బాధితుడు వివరించారు. సుమారు రూ.40 వేలు పైచిలుకు నష్టం వాటిల్లిందని వాపోయాడు.

## యూటీఎఫ్ అధ్యక్షుడిగా పోతురాజు

మేదరమెట్ల: కొరిశపాడు మండల యూటీఎఫ్ అధ్యక్షుడిగా కే.పోతురాజు, ప్రధానకార్యదర్శిగా డీ.పూర్ణచంద్రరావు ఎంపికైనట్లు యూటీఎఫ్ సభ్యులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మేదరమెట్ల యూటీఎఫ్ కార్యాలయంలో నిర్వహించిన ఎన్నికల్లో వీరిని ఎన్నుకున్నట్లు వారు చెప్పారు.

## విజేతలకు అభినందనలు

చీరాల: చదువుతో పాటు క్రీడల్లోనూ విద్యార్థులు రాణించాలని గౌతమి విద్యాసంస్థల డైరెక్టర్ ఎం సిహెచ్ వెంకటేశ్వర్లు అన్నారు. ఏపీ స్టేట్ తైక్వాండో చాంపియన్‌షిప్ 2022-23లో విజయం సాధించి నేషనల్స్‌కు ఎంపికైన పాఠశాల విద్యార్థులు పి.స్టీఫెన్ జాన్‌పాల్, పి.మేరీ స్టెల్లాలను స్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో కోచ్ సయ్యద్ సలావుద్దీన్, సీహెచ్ వెంకట ప్రసాద్, పి.ప్రశాంత్ బాబు, డైరెక్టర్లు ఎస్.శ్యామ్‌ప్రసాద్, కీర్తి వెంకట్రావు, ప్రిన్సిపాల్ రూఫస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## 11న జాతీయ లోక్ అదాలత్

అద్దంకి రూరల్: ఈ నెల 11వ తేదీన అద్దంకి కోర్టు ఆవరణలో నేషనల్ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు సీనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయసేవాధికారి సంస్థ చైర్మన్ బీ. బాబునాయక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అవకాశాన్ని అద్దంకి, కొరిశపాడు, జే. పంగులూరు, మార్టూరు, బల్లికురవ, సంతమాగులూరు మండలాల్లోని కక్షిదారులంతా వినియోగించుకోవాలన్నారు. రాజీ చేసుకోదగిన సివిల్ కేసులు, రెవెన్యూ కేసులు పరిష్కరించుకోవచ్చన్నారు. లోక్‌అదాలత్‌లో రాజీపడిన కేసులకు ఎలాంటి అప్పీలు ఉండదని ఆయన పేర్కొన్నారు.

## షాదీఖానాకు రూ.10 లక్షలు



చిల్లచెట్లు శుభ్రం చేస్తున్న జేసీబీ

చినగంజాం: ఇంకొల్లు పాత మద్రాస్ రోడ్డులోని ముస్లిం షాదీఖానా పనులను చేపట్టనున్న దృష్ట్యా శనివారం ఆవరణ పరిసరాలను శుభ్రం చేశారు. షాదీఖానా పూర్తి కాకుండా మధ్యలోనే ఆగి పోవడంతో జెడ్పీటీసీ భవనం శ్రీలక్ష్మి, మాజీ జడ్పీటీసీ భవనం శ్రీనివాసరెడ్డి చొరవతో జెడ్పీ నిధులు రూ.10 లక్షలను జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ మంజూరు చేయడంతో పనులు ప్రారంభించేందుకు సిద్ధం అయ్యారు. ఇందులో భాగంగా శనివారం ఆవరణలోని చిల్లచెట్లను తొలగించి శుభ్రం చేశారు.

## జూదరుల అరెస్టు

పర్చూరు: మండల పరిధిలోని నూతలపాడు గ్రామంలో పేకాట శిబిరంపై శనివారం పర్చూరు ఎస్సై చెంచు ప్రసాద్ దాడి చేసి నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. వీరి వద్ద నుంచి రూ.4540 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

# ఇంటిముంగిటకే మూగజీవాలకు చికిత్స



పశు ఆరోగ్యసేవ వాహనాన్ని ప్రారంభిస్తున్న నియోజకవర్గ ఇన్‌చార్జి వెంకటేష్



వాహనంలో కూర్చున్న వెంకటేష్

● నియోజకవర్గ ఇన్‌చార్జ్ కరణం వెంకటేష్

వేటపాలెం: పశుపోషకుల ఇంటి వద్దే మూగజీవాలకు మెరుగైన చికిత్స ప్రభుత్వం అందిస్తోందని చీరాల నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో డాక్టర్ వైఎస్సార్ సంచార పశుఆరోగ్య సేవ వాహనాన్ని ఆయన శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి విద్య, వైద్యానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. అందులో భాగంగానే గ్రామీణ ప్రాంతాల్లో రైతులు పోషించుకొనే పశువులకు వారి ఇంటి వద్దనే పశువైద్యం అందే విధంగా చర్యలు చేపట్టారన్నారు. రైతులు, పశుపోషకులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. చీరాల డివిజన్ పశువైద్యశాఖ ఏడీఏ చిట్టిబాబు మాట్లాడుతూ చీరాల నియోజకవర్గానికి గతంలో చీరాలకు ఒక సంచార వాహనాన్ని కేటాయించారని చెప్పారు. అయితే కొత్తగా వేటపాలెం మండలానికి మరో వాహనాన్ని ఏర్పాటు చేశామన్నారు. వాహనం ద్వారా మండలంలో అన్ని గ్రామాల్లో పశువైద్యం అందుబాటులోకి తేస్తామన్నారు. వాహనంలో ఒక డాక్టర్, కంపౌండర్, మరో అసిస్టెంట్ ఉంటారని చెప్పారు. పశువులకు ఎటువంటి ఆరోగ్య సమస్య వచ్చిన వెంటనే హెల్ప్‌లైన్ 1962 నెంబర్‌కి ఫోన్ చేసి సమాచారం అందించాలన్నారు. వెంటనే ఆప్రాంతానికి వాహనం వెళ్లి పశువులకు సత్వర వైద్యసేవలు అందిస్తారని పేర్కొన్నారు. వాహనంలో ల్యాబ్ సౌకర్యం కూడా ఉందని, 18 రకాల పరీక్షలు నిర్వహించి చికిత్స చేస్తారని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీవో శర్మ, పశువైద్యాధికారి పుష్పలత, ఏవో కాశీవిశ్వనాథ్, మాజీ సర్పంచ్‌లు మున్నంగి అరుణ్‌కుమార్, కట్టా గంగయ్య, అందే కృష్ణ, ఖాదర్, జమ్మి ప్రసాద్‌రెడ్డి, జిడుగు మస్తాన్, బొడ్డు సుబ్బారావు, సజ్జా పవన్, రాఘవ, ఏపీఎం శ్రీనివాసులు, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# పేదల జీవనోపాధికి బడుగు వికాసం



లబ్ధిదారుడికి కీ అందిస్తున్న కృష్ణ చైతన్య



చెక్కులు అందజేస్తున్న రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్ చైతన్య

అద్దంకి: పేదల జీవనోపాధికి బడుగు వికాసం పథకం ఊతం ఇస్తుందని రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్, వైఎస్సార్ సీపీ అద్దంకి నియోజకవర్గ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య అన్నారు. స్థానిక ఆర్‌అండ్‌బీ బంగ్లాలో ఆయన శనివారం బడుగు వికాసం పథకం ద్వారా ఎస్సీ ఎస్టీ లబ్ధిదారులకు మంజూరైన ఏడు వాహనాలను అందించారు. ఈ సందర్భంగా చైతన్య మాట్లాడుతూ కార్లను పేద ఎస్సీ, ఎస్టీ డ్రైవర్లకు 45 శాతం రాయితీపై సులభ వాయిదాల్లో చెల్లించుకునే విధంగా అందజేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ వైఎస్సార్ కేపీ ఏరియా కో ఆర్డినేటర్ రవికుమార్, ఏపీఎంలు, పార్టీ పట్టణ నాయకుడు కాకాని రాధాకృష్ణమూర్తి, మున్సిపల్ కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ..**

నియోజకవర్గంలోని వివిధ మండలాలకు చెందిన రోగులు వైద్య సాయం కోసం సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరైన రూ.11.64 లక్షల చెక్కులను కృష్ణచైతన్య శనివారం స్థానిక ఆర్‌అండ్‌బీ బంగ్లాలో అందజేశారు. ఈ సందర్భంగా చైతన్య మాట్లాడుతూ సీఎం జగనన్న పేదలకు సాయం చేయడంలో వెనుకంజ వేయరన్నారు. కార్యక్రమంలో స్థానిక నేతలు పాల్గొన్నారు.

# సైబర్ నేరాలపై అవగాహన అవసరం



పాల్గొన్న విద్యార్థినులు

వేటపాలెం: ప్రస్తుత ఆధునిక టెక్నాలజీలో సైబర్ నేరాలపై మహిళలు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని జేఎన్‌టీయూ యూనివర్సిటీ సీఎస్‌ఈ విభాగాధిపతి ఎఎస్ఎన్ చక్రవర్తి పేర్కొన్నారు. స్థానిక సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీలో సైబర్ నేరాలపై వెబినార్ శనివారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అధునిక డిజిటల్ ప్రపంచంలో మహిళలు ఆన్‌లైన్, సోషల్ మీడియాను ఎక్కువ వినియోగిస్తున్నారని తెలిపారు. దీని ద్వారా సమాచారాన్ని వేగవంతంగా చేరవేయడమే కాకుండా విద్యార్థినులు అకర్షణ పెంచుకుంటున్నారన్నారు. ఇటువంటి పరిస్థితుల్లోనే సైబర్ నేరగాళ్ల బారినపడే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో మహిళల భద్రత కోసం తీసుకోవాల్సిన ముందు జాగ్రత్త చర్యల గురించి వివరించారు. అవసరం ఉన్నప్పుడు మాత్రమే మీ మొబైల్ ఇంటర్‌నెట్ ఆన్ చేసుకోవాలని సూచించారు. ప్రిన్సిపాల్ మొయిద వేణుగోపాలరావు మాట్లాడుతూ అధునిక మహిళలు సరైన అవగాహన లేక ఈ-మెయిల్ స్పూఫింగ్, హ్యాకింగ్, సైబర్ పోర్నోగ్రఫి, సైబర్ ఫిల్టరింగ్ బారిన పడుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఐసీసీ సెల్ ఇన్‌చార్జి ఆర్‌ఎస్‌డీ ధనలక్ష్మి పాల్గొన్నారు.

## చోరీకి పాల్పడిన ముగ్గురి అరెస్టు

వేటపాలెం: ఫోటోగ్రఫి కోసం వచ్చిన వ్యక్తిని బెదిరించి నగదు, ఫోన్ లాక్కున్న కేసులో ముగ్గురిని పోలీసులు శనివారం అరెస్టు చేశారు. ఎస్సై జి సురేష్ వివరాల మేరకు.. చెన్నైకి చెందిన శరవణన్ తరచూ రామాపురం సముద్ర తీరానికి ఫొటోగ్రఫీ కోసం వస్తుంటాడు. ఈ నేపథ్యంలో అక్కాయిపాలెం పంచాయతీలోని లక్ష్మీపురానికి చెందిన అన్నారెడ్డి మున్నాతో శరవణన్‌కి పరిచయం ఏర్పడింది. శరవణన్ రామాపురం వచ్చినపుడు మున్నా కలుస్తుండేవాడు. అయితే జనవరి 11వ తేదీన శరవణన్‌ని మున్నా లక్ష్మీపురానికి తీసుకొచ్చాడు. ఆ సమయంలో శరవణన్‌ని చంపుతామని బెదిరించి ఆప్రాంతానికి చెందిన మల్లి రాజేష్, అన్నారెడ్డి మున్నా, అక్కల రామకృష్ణరెడ్డిలు అతని వద్ద నుంచి రూ. 60 వేల విలువగల సెల్‌ఫోన్, నగదు దౌర్జన్యంగా తీసుకున్నట్లు బాధితుడు ఫిర్యాదు చేశాడని ఎస్సై తెలిపారు. ఆ మేరకు నిందితులు ముగ్గురిని లక్ష్మీపురంలో అరెస్టు చేసినట్లు ఎస్సై చెప్పారు. వీరిని కోర్టులో హాజరు పరచగా నిందితులకు రిమాండ్ విధించినట్లు తెలిపారు.

# సంక్షేమం, అభివృద్ధే జగనన్న ధ్యేయం



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న శాప్‌నెట్ చైర్మన్ చైతన్య

● రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్ బాచిన కృష్ణచైతన్య

బల్లికురవ: రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అహర్నిశలు శ్రమిస్తున్నారని అద్దంకి వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యాక్రమంలో భాగంగా శనివారం మండలంలోని కూకట్లపల్లి సచివాలయం పరిధిలోని పద్మజా నగర్ కాలనీలో ఇంటింటికి తిరిగి ప్రభుత్వ పథకాలు అందుతున్న తీరు, సచివాలయ సిబ్బంది, వలంటీర్ల పనితీరు తెలుసుకున్నారు. కాలనీకి వచ్చేరోడ్డు అధ్వాన స్థితికి చేరిందని, అభివృద్ధి పరచాలని కాలనీ వాసులు చైతన్య దృష్టికి తెచ్చారు. ఇప్పటికే అంచనాల తయారీతో అభివృద్ధి పరిచేందుకు ప్రణాళిక సిద్ధం చేశామని, పదిరోజుల్లో పూర్తి స్థాయిలో అభివృద్ధి పరుస్తామని చైతన్య హామీ ఇచ్చారు. అభివృద్ధిని చూసి ఓర్వలేని చంద్రబాబు ఆయన పుత్రుడు లోకేష్, దత్తపుత్రుడు పవన్ కళ్యాణ్ అవాకులు చవాకులు పేలుతున్నారని విమర్శించారు. ఇదంతా ప్రజలు గమనిస్తూనే ఉన్నారని చైతన్య చెప్పారు. రాబోయో ఎన్నికల్లో సీఎం జగన్ మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలన్నారు. అంతకు ముందు గ్రామ కూడలిలోని దివంగత రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ చింతల పేరయ్య, మండల ఉపాధ్యక్షుడు ఇప్పలవెంకట సుబ్బారెడ్డి, స్థానిక నేతలు చింతల శ్రీనివాసరావు, సొసైటీ అధ్యక్షుడు ఇప్పల అంజిరెడ్డి, జాన్‌డీర్ సుబ్బారెడ్డి, గోళ్ల ఏడుకొండలరెడ్డి, తాటిపర్తి విజయ భాస్కర్‌రెడ్డి, తాళ్ల రవీంద్రరెడ్డి, విప్పలరామిరెడ్డి వివిధ గ్రామ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా..



వృద్ధురాలితో మాట్లాడుతున్న కరణం వెంకటేష్

● నియోజకవర్గ ఇన్‌చార్జి వెంకటేష్

చీరాల: ప్రభుత్వం అందిస్తున్న పథకాలు అందుతున్నాయా అవ్వా.. అంటూ అప్యాయంగా పలకరిస్తూ గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం సాగింది. శనివారం వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ పట్టణంలోని 8వ వార్డులోని ఏఆర్ నగర్ సచివాలయం పరిధిలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న పథకాలు ఏమేరకు వారి దరిచేరుతున్నాయోనని వారిని అడిగి తెలుసుకున్నారు. గత మూడున్నర సంవత్సర కాలంలో అందిన సంక్షేమ పథకాలను వారి మాటల్లోనే తెలుసుకున్నారు. అనంతరం వార్డు సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, వైస్ చైర్మన్ బొనిగల జైసన్‌బాబు, కమిషనర్ ఐసయ్య, కో-ఆప్షన్ సభ్యులు షేక్ ఫాతిమా, 8వ వార్డు ఇన్‌చార్జి షేక్ మహిముద్, షేక్ కబీర్, అమీర్, షేక్ అబ్దుల్ సలాం, బాజీ, సామ్యేల్, ఇలియాజ్, ఆర్‌బీకే చైర్మన్ కావూరి రమణారెడ్డి, కౌన్సిలర్లు మల్లెల లలిత, గోలి స్వాతి, మించాల సాంబశివరావు, కె.యానాదిరావు, చీమకుర్తి బాలకృష్ణ, కీర్తి వెంకట్రావు, బత్తుల అనిల్, తోకల అనిల్, వైఎస్సార్ సీపీ నాయకులు కోడూరి ప్రసాద్‌రెడ్డి, మల్లి రామకృష్ణ, వాసిమళ్ల వాసు, శ్రీను, యాతం మేరిబాబు, వార్డు సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా కోటి కుంకుమార్చన



కుంకుమార్చనలో మహిళలు

చీరాల అర్బన్: పట్టణంలోని స్థానిక పాపరాజుతోటలోని కామాక్షి సోమేశ్వర దేవాలయంలో స్వామి వారి 76వ వార్షికోత్సవం సందర్భంగా ఈనెల 1వ తేదీ నుంచి 10వతేదీ వరకు కోటి కుంకుమార్చన నిర్వహిస్తున్నారు. ఈ శనివారం మహిళలచే సామూహింగా కుంకుమార్చన చేశారు. ప్రతి రోజు 125 మంది మహిళలతో కుంకుమార్చన నిర్వహిస్తున్నారు. దేవస్థాన కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# కొనుగోలు కేంద్రాలతో రైతులకు మేలు



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న జీఎం రాంబాబు నాయక్

చినగంజాం: ఖరీఫ్ సీజన్‌లో రైతులు వరి ధాన్యం కొనుగోలుకు చేసేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని పీడీసీసీ బ్యాంక్ ఒంగోలు జనరల్ మేనేజర్ బీ రాంబాబు నాయక్ అన్నారు. శనివారం చింతగుంపల్లి పీఏసీఎస్ ఆధ్వర్యంలో మండలంలోని చినగంజాం, గొనసపూడి, మోటుపల్లి, కడవకుదురు గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల్లో ఖరీఫ్ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. చీరాల ప్రాంతీయ కార్యాలయం డీజీఎం వై ప్రకాశ్ మాట్లాడుతూ ఏ గ్రేడ్‌వరి ధాన్యం క్వింటా రూ. 2060 , కామన్ రకం రూ.2040 అని తెలిపారు. కార్యక్రమంలో ఏవో కే భాస్కరరావు, చీరాల పీడీసీసీ బ్యాంక్ మేనేజర్ టీఎస్ వాసుదేవసింగ్, పీఏసీఎస్ ముఖ్య కార్యదర్శి జీ శేఖరరావు, ఎస్ నాగబాబు, ఎం వీరయ్య, వీపీఏ జశ్వంత్, బీ కిషోర్, సొసైటీ ప్రెసిడెంట్‌లు ఎం రామకృష్ణ పాల్గొన్నారు.

## మెరిట్ విద్యార్థులకు నగదు ప్రోత్సాహకం

చినగంజాం: స్థానిక ఎస్‌ఆర్ అండ్ వీఎస్‌ఆర్ గరల్స్ హైస్కూల్‌లో 2021-22 బ్యాచ్ 10వ తరగతిలో మెరిట్ సాధించిన విద్యార్థులకు దాతలు శనివారం నగదు ప్రోత్సాహకం అందజేశారు. డాక్టర్ బొర్రా బొల్లయ్య, సరస్వతి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బొర్రా ఈశ్వరమ్మ మెమోరియల్ క్యాష్ అవార్డును విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభకు ఇంకొల్లు యూనియన్ బ్యాంక్ డిప్యూటీ బ్రాంచ్ మేనేజర్ కే దినేష్ ముఖ్య అతిథిగా హాజరు కాగా పాఠశాల హెచ్‌ఎం ఉదయ కుమారి అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో దాతలతో పాటు పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎన్‌సీసీ బీ సర్టిఫికెట్‌కు 686 మంది హాజరు

చీరాల అర్బన్: చీరాలలోని వీఆర్‌ఎస్‌వైఆర్‌ఎన్ కాలేజీలో శనివారం ఎన్‌సీసీ బీ సర్టిఫికెట్ పరీక్ష నిర్వహించారు. గుంటూరు గ్రూప్‌లోని 22 బెటాలియన్, 23 బెటాలియన్, 34 బెటాలియన్‌లోని 686 మంది ఎన్‌సీసీ క్యాడెట్లు పరీక్షకు హాజరయ్యారు. పరీక్షలో అయుధ శిక్షణ, డ్రిల్, ఫీల్డ్ క్రాఫ్ట్, బ్యాటిల్ క్రాఫ్ట్, మ్యాప్ రీడింగ్, కమ్యూనికేషన్ అంశాలపై పరీక్షలు నిర్వహించారు. పరీక్షను గుంటూరు గ్రూప్ కమాండర్ కల్నల్ జయకుమార్ పర్యవేక్షించారు. కార్యక్రమంలో కల్నల్ సునీల్ గౌతమ్, కల్నల్ చంద్రర్, ఆర్‌పి సింగ్, సత్యనారాయణ పాల్గొన్నారు.

## చికిత్స పొందుతూ యువకుడు మృతి

మార్టూరు: ప్రమాదవశాత్తు రసాయనిక ఎరువు పిచికారీ చేసిన మామిడి కాయ తిని ఆసుపత్రి పాలైన యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈఘటన మండలంలోని కొనంకి గ్రామంలో శనివారం వెలుగు చూసింది. ఎస్సై కమలాకర్ వివరాల మేరకు.. కోనంకి గ్రామానికి చెందిన గుంటూరు మస్తానయ్య అదే గ్రామానికి చెందిన వేజండ్ల రమేష్కు చెందిన మామిడి తోటలో పని చేస్తున్నాడు. గత నెల 4వ తేదీ మస్తానయ్య మామిడి తోటకు గడ్డి మందు పిచికారీ చేసి పనిమీద ఒంగోలు వెళ్లాడు. ఈ విషయం తెలియని మస్తానయ్య కుమారుడు రాజేష్ 19 తోటలోని ఓ మామిడి పండు కోసుకుని తినగా అస్వస్థతకు గురైనాడు. మధ్యాహ్నం వచ్చి అపస్మారక స్థితిలో ఉన్న కుమారుడిని తండ్రి గుంటూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రాజేష్ పరిస్థితి విషమించి శనివారం మరణించినట్లు ఎస్సై తెలిపారు.

# పరిమితికి మించి ఎక్కించుకుంటే జరిమానా



ఆటో డ్రైవర్లతో మాట్లాడుతున్న ఎస్సై తిరుపతిరావు

జే.పంగులూరు: పరిమితికి మించి ఆటోలో ప్యాసింజర్లను ఎక్కించుకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని రేణింగవరం ఎస్సై కేకే తిరుపతిరావు ఆటో డ్రైవర్‌ను హెచ్చరించారు. శనివారం పోలీస్ స్టేషన్‌లో మండల పరిధిలోని ఆటో డ్రైవర్లకు ప్రమాదాల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ఆటోలో కూలీలను మితిమీరి అధిక సంఖ్యలో ఎక్కించుకొని వేగంగా నడపటం వలన ప్రమాదాలకు గురౌతుందన్నారు. ఆటో డ్రైవర్లు బద్రతా నియమాలు పాటించాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది, ఆటో డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వాసుపత్రుల్లో ప్రసవాలు సురక్షితం

యద్దనపూడి: గర్భిణులు విధిగా ప్రభుత్వ వైద్యశాలల్లో వైద్యసేవలు పొందటంతో పాటు కాన్పులు తప్పనిసరిగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో చేయించుకోవాలని పీహెచ్‌సీ వైద్యాధికారి సుభాషిణి సూచించారు. శనివారం పీహెచ్‌సీ కేంద్రం పరిధిలోని గర్భిణులకు వైద్యపరీక్షలు నిర్వహించి రక్తహీనత రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మాతా శిశుమరణాలు సంభవించకుండా చేపట్టాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. ప్రతినిత్యం పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవటంతో పాటు రక్తహీనత రాకుండా ఐరన్‌మాత్రలు, ఆకుకూరలు, కాయకూరలు, పండ్లు, పాలు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. ప్రతి 20 రోజులకు ఒకసారి వైద్యులను సంప్రదించటంతో పాటు వ్యాధి నిరోధక టీకాలను తప్పకుండా తీసుకోవాలన్నారు. ఏఎన్ఎమ్‌లు, ఆశ కార్యకర్తలు, బాలింతలు, గర్భిణుల ఆరోగ్య స్థితిగతులను ఎప్పటికప్పుడు పరిశీలించాలని ఆదేశించారు. కార్యక్రమంలో వైద్య, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

## గ్రంథావిష్కరణ సభ నేడు

అద్దంకి: సృజన సాహితి సంఘం ఆధ్వర్యంలో ఆదివారం పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి రచించిన సృజన సాహితీ వైభవం గ్రంథాన్ని స్థానిక రామసుశీల నిలయంలో ఉదయం 10 గంటలకు ఆవిష్కరించనున్నట్లు సృజన సంఘ అధ్యక్షుడు పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సభలో గ్రంథ సమీక్షకుడిగా డీపీఎం సత్యనారాయణ, పుస్తకావిష్కరణను ప్రముఖ సాహితీవేత్త భూసురపల్లివెంకటేశ్వర్లుహాజరుఅవుతున్నట్లు తెలిపారు. సమావేశానికి సాహితీవేత్తలు,సాహిత్యాభిమానులు హాజరు కావాలని కోరారు.

## పేదల సొంతింటి కల సాకారం



లబ్ధిదారులతో మాట్లాడుతున్న డీఎల్‌డీవో

అద్దంకి: జగన్న కాలనీల్లో ఇంటి నిర్మాణం చేసుకున్న లబ్ధిదారులకు సొంతింటి కల నెరవేరినట్లేనని డీఎల్‌డీవో రాజేశ్ అన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఆయన శనివారం మండల కేంద్రం సంతమాగులూరు, పాతమాగులూరులోని జగనన్న లే అవుట్‌లో లబ్ధిదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీఎల్‌డీవో మాట్లాడుతూ ప్రభుత్వ పేదలకు ప్రభుత్వం ఇచ్చే నగదుతోపాటు, డ్వాక్రా రుణం కూడా ఇప్పిస్తున్నట్లు చెప్పారు. లబ్ధిదారులు వెనుకాకుండా ఇచ్చిన ప్లాట్లలో ఇంటి నిర్మాణం ప్రారంభించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో సాంబశివరావు, ఎంపీపీ ఎనుబర్ల యలమంద, తదితరులు పాల్గొన్నారు.

## పంట నమోదు పరిశీలన

చీరాల రూరల్: పంట నమోదు పరిశీలన కార్యక్రమాన్ని శనివారం మండల పరిధిలోని పలు గ్రామాలలో రెవెన్యూ డివిజనల్ అధికారిణి పి. సరోజిని ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి గ్రామంలో రైతులు తమ పంటలను నమోదు చేసుకోవాలని సూచించారు. పంటలను నమోదు చేయించుకుంటే విపత్తు సమయాల్లో నష్టపరిహారం అందించుటకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని తెలిపారు. ఆర్డీవో వెంట తహసీల్దార్ జీవి గుంట ప్రభాకరరావు, వీఆర్వో శేఖర్‌లు ఉన్నారు.